## చిన్న కథ

# ఈక్వేషన్

-ఎ.పుష్పాంజలి

'రండి'! తలుపు తెరిచి ఆహ్వానించిందామె.

ఎర్రటి క్రేప్ చీర కట్టుకుని, ఎర్రటి బొట్టు పెట్టుకుంది. కళ్లల్లో ఎర్రటి జీరలు. లూజ్‌గా వదిలేసిన జుట్టు. ఆమె చెంపల మీద చిలిపిగా ఆడుతోంది.

"లక్ష్మీదేవిలా.... ఛ.. ఛ.. కాదు. రతీదేవిలా ఉంది?"

ఆమె అందాన్ని కళ్లతో జుర్రుకుంటూ అనుకున్నాడు.

ఆమె కూర్చోమన్నట్టు సోఫా చూపింది. ఆ సోఫా మంచానికి తక్కువగా, సోఫా కెక్కువగా, ప్రత్యేకంగా ఉన్నట్టు గమనించాడు.

ఆమె నవ్వుతు అంది. "మీ కోసమే ఎదురు చూస్తున్నాను..."

"మీరెదురు చూస్తుంటారనే..."

"ఆఘమేఘాల మీదొచ్చారా...?" అని పూర్తి చేసింది. మాటమాటకీ మధ్య నవ్వు నేపథ్య సంగీతంలా అతని మనసుకి విందు చేస్తోంది.

"కాస్త ఏమైనా తీసుకోండి. ఏం తీసుకుంటారు" అడిగింది అదే నవ్వుతో.

"ఈ సందర్భాల్లో తనేం తీసుకుంటాడు?" ప్రశ్నించుకున్నాడు. 'అబ్బే వద్దు. వద్దు. తనింకా లక్ష్మణరేఖ దాటలేదు కదా, అప్పుడే అంత చనువు పనికిరాదు' అనుకుంటూ పైకి "మీ ఇష్టం... ఏమైనా సరే" అన్నాడు.

ఆమె నవ్వుతూ లోపలికెళ్లిపోయింది.

'అసలాఫీసులో ఎంతో సీరియస్‌గా ఉంటుంది. ఇంతలా మరీ నవ్వగా తనొక్కసారి కూడా చూడలేదు. ఇప్పుడు లోపల్నించేంతెస్తుందో? టీ... కాఫీ.. వేడివేడిగా...పోన్లే... నవనాడులూ ఉత్తేజితమౌతాయి. ఈసారికి యడ్జస్టయి పోదాం'.

ఆమె అదే నవ్వుతో చేతిలో ఓ పెద్దగాజు గ్లాసుతో వచ్చింది.

"ఏంటవి? తెల్లగా! పాలా"

"తీసుకోండి" అంది.

ఆ గ్లాసు మంచులా చల్లగా తగిలింది. అది మజ్జిగ! 'పోన్లే, ఆరోగ్యానికి మంచిది'.

ఆమె అతనికెదురుగా కూచుని "ఇక్కడ కొన్ని ప్రిన్స్‌పుల్స్ పాటిస్తాం" అంది.

"మంచిదే" అన్నాడు పేలవంగా నవ్వుతూ. ఆ చల్లటి మజ్జిగ తాగడం అతనికెంతో ఇబ్బందిగా ఉంది.

"ఏం సూత్రాలో అవి" అనుకుంటూ "ఇంట్లో ఎవరులేరా?" అన్నాడు

"మీకెవరు కావాలి?" మళ్లీ నవ్వు.

ఆఫీసులో అంతసీరియస్‌గా ఉండే ఈవిడ అంతలా నవ్వుతుందే అనుకున్నాడు. "ఎవరు కావాలి" అన్న ప్రశ్నకు "నువ్వే" అని సమాధానం చెప్పుదామనుకొని 'తనింకా లక్ష్మణ రేఖ దాటలేదు కదా' అని మానేశాడు.

"హనుమంతరావుతో మీకెన్నాళ్లు పరిచయం?" అడిగిందామె.

"చాలా సంవత్సరాలుగా ఏం?"

"మీరిద్దరూ బాగా స్నేహితులనుకుంటాను".

"చాలా. చాలా". అసలీవాళ తన అప్పాయింట్‌మెంటిక్కడ ఫిక్స్ చేసింది వాడే. వాడిటువంటి విషయాల్లో చాలా దిట్ట!

"అతనికి పిల్లలెందరు? భార్య ఏం చేస్తారు?" అడిగింది.

"ముగ్గురు పిల్లలు. చెల్లెమ్మ నా మిసెస్‌తో బాటూ ఎల్.ఐ.సీలో జాబ్ చేస్తున్నది".

"ఓహో! ఐతే భార్య కూడా ఒక ఉద్యోగినీ! చెల్లెమ్మా అంటున్నారే. బంధువుల కూడానా".

"అబ్బే లేదండి. ఫామిలీ ఫ్రెండ్స్ మాత్రమే. నా భార్యను వాడు చెల్లెమ్మా అనడం, వాడి భార్యను నేను చెల్లెమ్మా అనడం అలవాటు".


"ఓహో అలాగా... పోనీలెండి. ప్రపంచంలో ఒక స్త్రీ బతికి పోయింది" ఈసారి ఇంకా గట్టిగా నవ్వింది.

చాలా ఘాటైన జోక్! అతనూ గట్టిగా నవ్వాడు.

"హనువంతరావు గారు చాలారోజులుగా ఈ విషయం గురించి మాట్లాడుతున్నారు" అంది.

"అవును. నేనే..." అన్నాడు నానుస్తూ.

ఆమెని చాలా రోజులుగా గమనిస్తున్నాడు. ఒక్కత్తే రావడం, పోవడం, ఎవరితోనూ మాట్లాడక పోవడంతో ఆమె ఒంటరిగా ఉంటుందన్న నిర్ణయానికి వచ్చి ఈ సాహసం చేశాడు. హనుమంతరావుతో కబురు పెట్టగానే ఆమె చాలా పాజిటివ్‌గా రియాక్ట్ అయిందని తెలిసి తెగ మురిసిపోయాడు. 'ఏనా తను పై ఆఫీసర్! ఏమంటుంది ఒప్పుకోక!' గర్వంగా ఫీలయ్యాడు.



"మీ వారు... పిల్లలూ?" అడిగాడు.

"ఇప్పుడు వాళ్ల సంగతెందుకు లెండి" అంది.

'నిజమే. ఈ సమయంలో భర్తలనీ పెళ్లాలనీ తలచుకుంటే మూడ్ పోదూ'.

"ఇల్లు చూడొచ్చా? ఎన్ని పోర్షన్లు? చాలా పెద్దదిగా ఉంది" అడిగాడు. ఆమె జవాబు చెప్పకుండా నవ్వి "దానికేం చూద్దురు గాని. ముందుగా ఓ విషయం అడగాలి. నాలాంటి అజ్ఞానుల అనుమానాలు మీలాంటి జ్ఞానులు నివృత్తి చేయాలిగా" అంది అదే నవ్వుతో.

"అలా అనకండి ప్లీజ్. మీ అందం ముందు అన్నీ దిగదుడుపే".

'తను దాటేస్తున్నాడు. లక్ష్మణరేఖ దాటేస్తున్నాడు...'

"మిమ్మల్ని చూశాక మీ బెడ్ రూం ఇంకా ఎంతందంగా ఉంటుందో చూడాలని ఉవ్విళ్లూరుతున్నాను" లక్ష్మణరేఖ మీద అడుగు పెడ్తూ అన్నాడు.

"చూద్దురుగాని... ముందిది చెప్పండి. మీరు చాలా విశాల హృదయులని నాకు గట్టి నమ్మకం. లేకుంటే ఇంత చొరవగా... ఇలా... రారే.... మీకు బెరుకు లేదా. బాగా అలవాటా?"

కళ్లింతవి చేసి చూస్తూ అడిగింది.

ఒక్కసారి షాక్ తగిలింది. ఈమె ఎంతో అమాయకంగా అడుగుతోంది. పాపం! తనేం చెప్పాలి?

"మీ భార్య కూడా ఎంప్లాయీ అంటున్నారుగా! ఆమె కూడా ఎవరినైనా ఇష్టపడితే... మీరు.. మీరు కాదనరు. చాలా విశాల హృదయాలు... ఊరికే. అడిగానంతే. రండి.. ఇల్లు చూద్దురు" లేచింది మామూలుగా.

అతని ఒళ్లు బాగా చల్లబడ్డది.

'ఆమె అమాయకంగా అడిగింది. తనే దెబ్బకొట్టిందని భయపడ్తున్నాడు. అదంతా ఏం లేదు.... ఏం లేదు' అనుకుంటూ ఆమెని వెంబడించాడు.

"రండి..." ఒక నడవాలోకి దారి తీసింది. వరండాకి అటువైపు వట్టివేళ్ల తడికెలు వరుసగా వ్రేళ్లాడుతున్నాయ్.

ఒక చోట ఆగి ఒక రూం తలుపు నెట్టింది. అది చాలా విశాలమైన రూంలా వుంది. ఇంత పెద్ద బెడ్ రూమా?

"రండి" మళ్లీ పిలిచింది.

లోపలి కడుగుపెట్టాడు.

ఎదురుగా పెద్ద పెద్ద ఎగ్జిక్యూటివ్ టేబుల్స్, వాటి మీద సిస్టమ్స్, ఆ వెనకాల ఒకాయన సీరియస్‌గా పని చేసుకుంటున్నాడు. ఇది ఆఫీస్‌రూం... ఎవర్ది?

అలికిడి విని తలెత్తిన అతను చెయ్యెత్తి 'హలో' అన్నట్టు ఎత్తిదించాడు చిరునవ్వుతో.

అతన్ని... అతన్ని... తనెక్కడో... ఎక్కడో చూశాడు.

"మా వారు" పరిచయ పూర్వకంగా అంటూ వెలుపలికి దారితీసింది.

అతనికి గుర్తొచ్చింది. ఆయన చీఫ్ సెక్రెటరీ. తన లాంటి ఎందరో ఆఫీసర్లకు పై అధికారి.

అతని గొంతు తడారిపోయింది. అడుగులు తడబడుతున్నాయ్.

ఆమె ఒక తడికెను పైకెత్తింది, రోప్‌లాగి.

అవతల పెద్ద 'ఏవరీ' కనిపిస్తోంది. ఎదురుగా పంజరంలో రామచిలుక "సంభవామి యుగే... యుగే.. సంభవామి యుగే... యుగే" అంటున్నది ముద్దుగా.

ఒక్క సెకండులో అతని మానసిక స్థితి పూర్తిగా తారుమారైంది.

"ఆయన చాలా బిజీగా ఉంటారు. ఏమీ అనుకోకండి..."

ఆమె ఏదో చెబుతూ ఉంది. అతనికి వినిపించడం లేదు.

'ఓ... ఈయన... ఈమెకి భర్తా? ఎవ్వరికీ తెలియదే... ఉద్యోగం చేసే ఆడాళ్లకి ఎంత పెద్ద భర్తలు, ఛ. ఛ, ఇంతపెద్ద భర్తలున్న భార్యలు కూడా ఉద్యోగాలు చేస్తారా....? అసలు ఉద్యోగినులకు భర్తలు.. ఛ... ఛ... తన భార్యకు తను భర్తేగా...' అతని ఆలోచనలు సుళ్లు తిరుగుతున్నయ్.

"బెడ్ రూం చాలా లోపలికి ఉంటుంది... దాన్నిండా పుస్తకాలే.." ఆమె చెప్తూ ఉంది.

"ఆఁ బెడ్‌రూం... వాట్ బెడ్‌రూం? వెళ్లాలి. తొందరగా వెళ్లాలి..."

"అదేమిటి అటు వెళ్తున్నారు. రండి. ఇటు రండి. అటు వెళ్తే బైట రోడ్డు మీదికి వెళ్తారు".

"అవును. రోడ్డు మీదికే వెళ్లిపోవాలి..." అతను అస్పష్టంగా ఏదో గొణుక్కుంటూ నడుస్తున్నాడు.

"అదేమిటి? వెళ్లిపోతున్నారు. అప్పుడే..!"

"..............."

"అయ్యో జాగ్రత్త. గుమ్మం కొట్టుకుంది. చూశారా"

"బెడ్ రూం చూడరా?" ఝుణఝుణ ఆమె నవ్వు అస్పష్టంగా వినిపిస్తోంది. వెనకనుంచి.

అతను దాటాలనుకున్న ఆ లక్ష్మణరేఖ నిప్పు కొరడాలా అతని వీపు ఛెళ్లుమనిపించింది.

*